# దేవుడు మీ మధ్య అద్భుత కార్యములు చెయ్యాలి అంటే

యెహోషువ రేపు యెహోవా మీ మధ్య అద్భుతకార్యములను చేయును గనుక మిమ్మును మీరు పరిశుద్ధపరచు కొనుడని జనులకు ఆజ్ఞ ఇచ్చెను. (యెహోషువ 3: 5) నీ దేవుడైన యెహోవా నిన్ను విడిపించుటకును నీ శత్రువులను నీకు అప్పగించుటకును నీ పాళెములో సంచరించుచుండును గనుక ఆయన నీలో అసహ్యమైన దేనినైనను చూచి నిన్ను విడువకుండునట్లు నీ పాళెము పరిశుద్ధముగా ఉండవలెను, (ద్వితి 23:14) యెహోషువా అంటున్నాడు దేవుడు రేపు మీ మధ్య అద్భుత కార్యములు జరిగించబోతున్నాడు కనుక మిమ్మును మీరు పరిశుద్ధపరచుకొనుడి. ఇది చదువుతున్న వారిలో ఎంతమంది దేవుని యొక్క అద్భుతాలను స్వతంత్రించుకోవాలని ఆశిస్తున్నారు? అయితే గమనించండి దేవుడు అద్భుతములు, ఆశ్చర్యకార్యములు చెయ్యడానికి సిద్ధముగా ఉన్నాడు. కానీ ఒక షరతు. మనము క్రీస్తు యొక్క రక్తములో కడగబడి పరిశుద్ధపరచబడాలి. పరిశుద్ధమైన జీవితమును జీవించాలి అప్పుడే మన జీవితంలో ఆశ్చర్యకార్యములను చూడగలము. రెండవది ఆయా సందర్భాలలో దేవుడు మన పాళెములో సంచరిస్తారు అనగా మన వీధిలో, మన గ్రామములో, మనము నివసిస్తున్న అపార్ట్మెంట్లో మన గృహములో సంచరిస్తాడు. దేవుడు అంటున్నాడేమో?.... నేను మిమ్ములను దీవించడానికి, విడిపించడానికి, మీకు విజయాన్ని ఇవ్వడానికి మీ దగ్గరకు వచ్చినప్పుడు.. మీరు పాపము చేస్తూ కన్పిస్తే, చూడకూడని వాటిని T.V లో, సెల్ ఫోన్లో చూస్తూ కన్పిస్తే, నీవు నీ భార్య లేదా నీ నీ భర్త గొడవలు పడుతూ కన్పిస్తే, ఇంట్లో అసమాధానము, పాపము కన్పిస్తే, ఇంట్లో వాక్యానికి విరుద్ధమైన వాతావరణము కన్పిస్తే నేను మిమ్మును అసహ్యించుకుని మీ పాళెమును, మీ గృహమును దాటి వెళ్ళిపోతాను కావున మీరు మీ ఇంట్లో పరిశుద్ధముగా జీవించాలి. అప్పుడే మిమ్ములను దీవించగలను.

సహోదరీ... సహోదరుడా..! దేవుడు మనకోసము దాచి పెట్టిన అద్భుత ఆశ్చర్యకార్యములు జవాబులు పొందుకోవాలి అంటే మనము దేవునికి అంగీకారముగా, పరిశుద్ధముగా జీవించాలి. మనము ఎక్కడెక్కడ పరిశుద్ధముగా జీవించాలో చూద్దాం.....

## 1. మీ ఇంటి లోపట పరిశుద్ధముగా జీవించాలి

గృహము లోపట పరిశుద్ధముగా జీవించకుండా, గృహము బయట పరిశుద్ధముగా జీవించడం సాధ్యము కాదు. గృహము లోపట పరిశుద్ధముగా జీవించాలి అంటే మొదట నీ శరీరము అనే గృహములో పరిశుద్ధత ఉండాలి. ఎందుకని? హృదయము నిండిన దానిని బట్టి నోరు మాట్లాడుతుంది. హృదయము నిండిన దానిని బట్టే, కళ్ళు చూస్తాయి, చెవులు వింటాయి, శరీరము ప్రవర్తిస్తుంది. "నా ఇంటిలో ఏ దుష్కార్యము నేను చూడను. ఏ పాపమునకు చోటు ఇవ్వను అని నీవు తీర్మానము తీసుకోవాలి. మార్కు 7:21 లోపలినుండి, అనగా మనుష్యుల హృదయములో నుండి దురాలోచనలును జారత్వములును దొంగతనములును మార్కు 7:22 నరహత్యలును వ్యభిచారములును లోభములును చెడుతనములును కృత్రిమమును కామవికారమును మత్సరమును(మూలభాషలో- చెడ్డ కండ్లును) దేవదూషణయు అహంభావమును అవివేకమును వచ్చును.

మార్కు 7:23 ఈ చెడ్డ వన్నియు లోపలినుండియే బయలువెళ్లి, మనుష్యుని అపవిత్ర పరచునని ఆయన చెప్పెను.

ఆ ఇంట్లో తండ్రి చనిపోయాడు, ఒక సందర్భములో పాప తన తల్లిని - మమ్మీ.! డాడి ఎక్కడికి వెళ్ళారు? అని అడిగెనట. చక్కని ఆత్మీయత కలిగిన ఆ తల్లి ఇచ్చిన సమాధానం అమ్మా.! దేవుడు తన దూతలను పంపించి డాడీని తీసుకురమ్మని అన్నారు. వాళ్ళు వచ్చి డాడీని తీసుకుని వెళ్ళారు. ఆ దూతలను దేవుడు మరలా పంపిస్తాడు. అప్పుడు మనము కూడా వెళ్ళవలసి ఉంటుంది అప్పుడు ఆ పాప మమ్మీ..! అయితే ఆ దూతలు ఎప్పుడు వస్తారు? ఎప్పుడు వస్తారో తెలియదు కాని ఖచ్చితముగా ఆ దూతలు వస్తారమ్మా అని తల్లి చెప్పగా... అప్పుడు ఆ పాప అంటుంది- మమ్మీ.! ఆ దూతలు ఎప్పుడు వస్తారో తెలియదు కావున మనము ఇప్పుడే అన్నీ సర్దుకొని మనం రెడిగా ఉంటే బాగుంటుందేమో.

నా ప్రియ సహోదరీ, సహోదరుడా.. దేవుడు నీకోసం దాచి పెట్టిన, నీవు ఎన్నడూ ఊహించని ఆశీర్వాదాలు, దీవెనలు ఆశ్చర్యకార్యములు నీ జీవితములో చెయ్యబోతున్నాడు. కాని ఆయన నిన్ను దీవించడానికి ఎప్పుడు వస్తాడో... ఆయన ఎప్పుడు వచ్చి నిన్ను దీవెనలతో ఆశ్చర్యపరుస్తాడో నీకు తెలియదు కావున నీవు ప్రతి క్షణం సిద్ధముగా, పరిశుద్ధముగా ఉండాలి. అప్పుడే దేవుడు నీ కోసం తీసుకు వచ్చిన దీవెనలను స్వతంత్రించుకోగలవు.

## 2.నీవు ఒంటరిగా ఉన్నపుడు పరిశుద్ధముగా ఉండు

నీవు ఒంటరిగా ఉన్నావా? అయితే ఖాళీగా ఉండవద్దు, ఖాళీగా ఉన్నావా అయితే ఒంటరిగా ఉండవద్దు. ఎందుకని? సైతాను, ఈ ప్రపంచములో గొప్ప గొప్ప వారిని, పెద్ద పెద్ద వారిని పడవేసిన సందర్భము అది వారు ఒంటరిగా ఉన్నప్పుడే........

- దేవుడు సృష్టించిన మొట్ట మొదటి స్త్రీ హవ్వ "ఆమె ఒంటరిగా ఉన్నప్పుడే సైతాను ఆమెను శోధించాడు." (ఆది 3:1-8)
- బహు బలాఢ్యుడైన సమ్సోను ఒంటరిగా వెళ్తున్నప్పుడే సైతాను శోధించి లోపరచుకున్నాడు. (న్యాయా 14:1-)
- దావీదు- యెహోవా హృదయానుసారుడు కాని ఒంటరిగా మిద్దె మీద తిరుగుతున్నప్పుడే శోధించబడి పాపములో పడిపోయాడు.* (సమూ 11:1-10)
- యేసుక్రీస్తు 40 దినాలు ఉపవాసము ఉన్న తరువాత అరణ్యములో ఒంటరిగా ఉన్నప్పుడే సైతాను వచ్చి భయంకరముగా శోధించాడు.(మత్త 41-11)
- యోసేపు ఒంటరిగా ఉన్నప్పుడు ఆ దుష్టురాలు శోధించింది. (ఆది 39:8-11) నీవు ఒంటరిగా ఉన్నప్పుడే సైతాను బహు బలముగా నీ మీదకు దిగి వస్తాడు కావున ఒంటరిగా ఉన్నప్పుడు నీ ఆత్మీయత విషయంలో బహు జాగ్రత్తగా ఉండాలి.

## 3. ఉద్యోగములో లేదా వ్యాపారములో పరిశుద్ధముగా ఉండు

నీవు ఇంటి దగ్గర పరిశుద్ధముగా ఉంటే సరిపోదు, ఉద్యోగము చేసే చోట కూడా పరిశుద్ధముగా ఉండాలి. నీ సంపాదన పవిత్రమైన సంపాదనగా ఉండాలి. అపవిత్రమైన పనులు చేస్తూ, అన్యాయముతో, అవినీతితో కూడిన లెక్కలు వేస్తూ అన్యాయముగా సంపాదించడానికి వీలు లేదు. (కీర్త 37:16) ఉద్యోగం చేసే చోట నీ ప్రవర్తన యధార్ధముగా ఉండాలి. స్నేహం ముసుగులో తోటి ఉద్యోగస్తులతో ఒంటరిగా గడిపే ప్రయత్నం చెయ్యడం కానీ, ఎక్కడికి పడితే అక్కడికి వెళ్ళే ప్రయత్నం చెయ్యడం కానీ, చనువుగా ఉండడం కానీ దేవుని బిడ్డలకు తగనే తగదు. క్యారెక్టర్ కాపాడుకునే ప్రయత్నములో యోసేపు ఉద్యోగాన్ని పోగొట్టుకున్నాడు. కానీ దేవుని దృష్టిలో బహు ప్రియునిగా కన్పించాడు. కాబట్టి దేవుడు అతనిని ఉన్నతమైన స్థాయికి తీసుకుని వెళ్ళాడు. యోసేపు తన ఉద్యోగములో యజమానురాలిని సంతోషపరిస్తే ప్రమోషన్ వచ్చేదేమో కానీ దేవుడిని సంతోషవరచాలని చెప్పి ఉద్యోగాన్ని పోగొట్టుకుని క్యారెక్టర్ ని కాపాడుకున్నారు. ఫలితము దేశాన్ని పరిపాలించే ఉన్నతమైన స్థానాన్ని పొందుకున్నాడు. (ఆది 41:42-46)

## 4. నీ స్నేహితుల మధ్య పవిత్రముగా జీవించు

చదువుకుంటునప్పుడు లేదా ఉద్యోగాలు చేసే చోట స్నేహితులు దేవుని వాక్యానికి వ్యతిరేకమైన జీవితాన్ని జీవించేవారు, పాపిష్టి పనులు చేసేవారు ఉంటారు వారిలో ఉండవచ్చు. వారు పాపము చెయ్యడానికి నిన్ను ప్రేరేపిస్తున్నప్పుడు నీవు వారితో పాపం చెయ్యకుండా నీ పరిశుద్ధతను కాపాడుకోవాలి. (సామెతలు - 1:10) పాపిష్టి పనులు చెయ్యడానికి స్నేహితులు లేదా బంధువులు నిన్ను తొందర చేసిన బలవంతము చేసిన నీవు ఖచ్చితంగా నో..చెప్పేవానిగా ఉండాలి."యధార్ధవంతులను బలపరుచుటకు యెహోవా కనుదృష్టి లోకములో సంచరించుచున్నది 2దిన 18;.కావున నీవు నీ ఇంటిలో ఉద్యోగంలో లేదా వ్యాపారంలో మరియు ఒంటరిగా లేదా స్నేహితుల మధ్య బంధువుల మధ్య పరిశుద్ధంగా, నీతిగా జీవించడానికి నిన్ను నీవు అప్పగించుకున్నప్పుడు దేవుడు నిన్ను బలపరచును.

Source: Pas. Abhishek